


# మల్లెలు నవ్వాయి

భమిడిపాటి అనంతనారాయణ

విసుగ్గా వాచీవంక చూసుకుంది గీత.

"అరు-పది" అనుకుంది చికాగ్గా.

"ఇంక ఇవాళ సినిమా చూసినట్టే..."

వంటిమీద తెల్ల సిల్కుచీర ముళ్ళు గుచ్చుకుంటున్నట్టుంది.

"ఇంకరారు" అనుకుంది.

కంట్లో నీరు తిరిగింది.

"ఇవాళసాయంత్రం సినిమాకువెళ్దాం. తెల్లసిల్కుచీర కట్టుకు రెడీగా వుండు ఇవాళకు మన పెళ్ళయి ఏడాదయింది" అన్నాడు మూర్తి ఆవేళ పొద్దున్న ఆఫీసుకు వెళ్తూ.

"వేగం ఐదు గంటలకే వచ్చేయండి" అంది గీత.

అన్నమాటమీద నిలబడ్డదెప్పుడు? .. ఏదో మాయకబుర్లు చెప్పి మురిపిస్తాడు.

సరిగ్గా ఏడాదయింది పెళ్ళయి!

తలంబ్రాలు పోసేటప్పుడు ఏం అల్లరి చేశారు!

సిగ్గుతో నవ్వుకుంది గీత.

ఆనందంగా గడపవలసింది ఈ రోజు.

ఏడ్పువస్తున్నది గీతకు.

వెధవ ఆఫీసు పని రేపు చూసుకో కూడదూ.

రోజూ ఉండేపనేగా....

చీర మార్చుకుంది. కసిగా ఉండలు చేస్తూ పెట్లో కుక్కేసింది సిల్కుచీరను.

తల దిమ్ముగా ఉంది.

రేడియో పెట్టింది.

"మధుర మధుర మీ చల్లనిరేయి..." అంటూ వినిపిస్తూంది భానుమతి కంఠం. కసిగా రేడియో పీక నొక్కేసింది.

ఏడయిపోయింది!

ఛళ్లున వీధి తలుపులు మూసి ఇంట్లోకి వచ్చేసింది గీత.

*　　　　*

"అరే! అప్పుడే ఆరయి పోయిందే? తొందరగా బయలుదేరాలి. గీత ఎదురు చూస్తూ ఉంటుంది" అనుకున్నాడు మూర్తి.

"మిస్టర్ మూర్తీ! ఈ ఎస్టిమేట్స్ కాస్త చూడు. వెరీ అర్జంట్. రేపు బిల్స్ పాస్ చెయ్యాలి" అన్నాడు ఇంజనీరు.

ఫైలుతో ఒక్కటి ముఖంమీద కసి తీరా కొట్టాలనిపించింది మూర్తికి.

వీడికి పెళ్లాం పిల్లలు లేరు అనుకున్నాడు.

వీడి పెళ్లాం చండిక కాబోలు. అందుకే రాత్రి పది గంటలవరకూ ఆఫీసులో ఏడుస్తాడు. "గాడిదకొడుకు" అనుకున్నాడు కసిగా.

వెధవ ఎస్టిమేట్లు.

ఆరున్నరయి పోయింది!

గీత పాపం ఎదురు చూస్తుంది.

ఛీ! వెధవ ఉద్యోగం!

అరవై ప్లస్ డెబ్బై ఫైనాల్గు ప్లస్....

గీత ఎంత డిసప్పాయింట్ అవుతుందో——

చిరాకుపడిపోతున్నాడు.

సరే సెకండ్ షోకు వెళ్లవచ్చు. వెధవ వర్కు వేగం కంప్లీట్ చెయ్యాలి.

ఇవాల్టికి పెళ్లయి ఏడాదయింది!

ఎంతో ఆనందంగా గడపవలసిన రోజు!

ఎనిమిదిన్నరకు ఆఫీసు పని పూర్తి చేసికొని లీలామహల్లో రెండు టిక్కట్లు రిసికొని తోవలో ఓ పావుశేరు మల్లెపూలు కొన్నాడు.

తెల్ల సిల్కు చీర మీద నల్లటి జడలో తెల్లటి మల్లెపూలు పెట్టుకుంటే——జడ పాములా మెలికలు తిరిగిపుంటే-చూడాలి గీతను.

హుషారుగా ఇంటికి బయలుదేరాడు సిగరెట్టు కాలుస్తూ.

*　　　　*

"గూట్లో అలమరలో కందిగుండ ఉంది. కుంపటిమీద అన్నం ఉంది. మీరు అన్నం తిని నాకు వడ్డించండి" అంది గీత చాకిట్లో కూచుని.

కసిగా టిక్కట్లు చింపసాగాడు మూర్తి.

టేబిల్ మీద మల్లెలు ఫక్కున నవ్వాయి!

———